


# అమెరికా ఇల్లాలి ముచ్చట్లు
## శ్యామలాదేవి దశిక



అమెరికా ఐనా, అమలాపురమైనా ఇల్లాలు..ఇల్లాలే. ముచ్చట్లు ముచ్చట్లే..

ఓ అమెరికా ఇల్లాలు నెల నెలా  మీతో పంచుకుంటున్న ముచ్చట్ల మురిపాలు..!

## క్రీమ్ ఆఫ్ ది క్రాప్

అప్పుడప్పుడు నాకనిపిస్తుంది, మీకు చేతులెత్తి నమస్కారం చెయ్యాలని !

పుణ్యంకొద్దీ పురుషుడని ఏ జన్మలో ఏం పుణ్యం చేసుకున్నానో

మీలాంటి వ్యక్తి---------

ఏమిటీ? ఏమైనా పుచ్చుకున్నావా అంటున్నారా?

లేదండీ ! నిజంగానే అంటున్నాను.

ఆ రోజుల్లో మీరు అమెరికా వెళ్తుంటే ఆవు వెంబడి లేగదూడలాగా మీ వెంట వచ్చాను. కొత్త దేశమైనా మీరు మాత్రం మీకున్న చదువుతో కొండంత  విశ్వాసంతో వుంటే, నేను భయం భయంగా బిక్కుబిక్కుమంటూ నాజీవితం మొదలుపెట్టాను. నావాళ్ళ దగ్గరనుంచి నన్ను దూరం చేసి ఈ అమెరికా అడవిలో పడేసారని విసుక్కునేదాన్ని. అప్పట్లో మీమీద వుండే భయంతోటో, భక్తితోటో పైకి ఏమీ అనేదాన్ని కాదు. కానీ మిడిమిడి చదువులతో మిడిల్ క్లాస్ అమ్మాయిగా పెరిగిన నన్ను, ఇలాంటి హై క్లాస్ సొసైటీలో పడేసినందుకు లోలోపల తిట్టుకునేదాన్ని !

కొన్నాళ్ళయిన తర్వాత గాని తెలిసిరాలేదండి, నన్ను అమెరికా తెచ్చి నాకు ఎంత మేలు చేసారో !

మీలాంటి మగాళ్ళ ధర్మమా అని నాలాంటి అమ్మాయిలెందరో ఎక్కడో పడివుండాల్సిన వాళ్ళం ఎక్కడికో వెళ్ళాం. ఆ  రోజుల్లో మీరు ధైర్యంగా ఇలా రాబట్టే నాలాంటి ఆడవాళ్ళు ఇంత ముందుకు వెళ్ళగలిగారు.

మీరు మగాళ్ళు, మీకు తెలియదు.

ఆ రోజుల్లో మధ్యతరగతి అమ్మాయిలకు మధ్యతరగతి ఆలోచన్లు, మధ్యతరగతి కోరికలే వుండేవి. చేసుకున్నవాడు తిండీ, బట్టా ఇచ్చి పుట్టింటికి తరిమేయకుండా, కాస్తంత ప్రేమగా చూసుకుంటే అదే మహాభాగ్యం అనుకునే రోజులవి.

అసలు మా రాతల ప్రకారం ఏ బళ్ళో టీచరో, ఏ తాలూకా ఆఫీసులో గుమాస్తాకో, మహా అయితే బ్యాంకులో ఏ క్లర్కుకో పెళ్ళాలై అత్తెసరు బతుకులు బతకాల్సినవాళ్ళం ! అలాంటిది నాలాంటి ఎంతోమంది ఇల్లాళ్ళకు పెద్దపెద్ద డాక్టర్లు, గొప్పగొప్ప ఇంజినీర్లు,

పేరున్న సైటిస్టులు భర్తలుగా వచ్చారంటే అది అదృష్టం కాక మరేమిటి? !

మెళ్ళో మూడుముళ్ళు పడగానే మనసులోని ఆశలను-ఆశయాలను అణచివేసుకోవాలి కాబోలు అనుకునే నాలాంటి ఆడపిల్లలకు మీలాంటి మగాళ్ళు ఊపిరిపోసారు. ఇక్కడి సంఘంలో నిలదొక్కుకోటానికి మాచేత ఏబీసీడీలు దిద్దించి మా భవిష్యత్తుకు పునాదిరాళ్ళు వేసారు. మీబాధ్యతల బరువులో మాకూ స్థానమిచ్చి మమ్మల్ని గౌరవించారు. నూతిలో కప్పలుగా పెరిగిన ఆడవాళ్ళకు అమెరికా పేరుతో అందమైన సువిశాల ప్రపంచాన్ని చూపించారు.

నేను పుట్టి బుద్ధెరిగిన తర్వాత పట్నంలో చూసిన ఒకటీ అరా సినిమాలు, మాఊళ్ళో వేసే వీధినాటకాలు, స్కూలు పుస్తకాలు తప్ప వేరే ప్రపంచం ఎరగనిదాన్ని. అలాంటి నేను ఈ దేశం వచ్చి ఎన్ని కచేరీలు విన్నాను----ఎన్ని అద్భుతమైన నాట్యాలు చూసాను--- ఎంతమంది గొప్ప రచయితలను కలుసుకున్నాను, ఎన్ని చక్కని ఉపన్యాసాలు విన్నాను, తలుచుకుంటే నాకే ఆశ్చర్యమేస్తుంది !! ఎక్కడో మారుమూల పుట్టిన నేను ఇక్కడకు వచ్చి ఎం.ఎస్. సుబ్బలక్ష్మి గానకచేరీని విన్నప్పుడు నా జన్మ ధన్యమయిందనుకున్నాను. వెంపటివారి కూచిపూడి నృత్యాలు చూసినప్పుడు నా వొళ్ళు పులకరించిపోయింది. ఘంటసాలవారి గాన మాధుర్యాన్ని విని నన్ను నేనే మరిచిపోయాను. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నెన్నో------

నాతో పుట్టిపెరిగిన ఆడపిల్లలకుమల్లే నేను కుడా "వారింట్లో లేరు. వారొచ్చాక అడిగి చెప్తాను" అంటూ బతకాల్సిన నేను ఈ సమాజంలో ఇంత చక్కటి గుర్తింపుతో, ఇంతమంది స్నేహితులమధ్య ఇంత ఆనందంగా జీవిస్తున్నాను అంటే దీనికంతటికి కారణం మీరే కదండీ ?

చిన్నప్పుడు కలిసిమెలిసి పెరిగిన నా మేనత్త కూతురు దాని మనవడ్ని చూట్టానికి ఈదేశం వచ్చి మనింటికి కూడా వచ్చింది.

మీరు అదే టైములో పనిమీద వేరే వూరు వెళ్ళారు. అది వున్న నాలుగు రోజులు ఇద్దరం తిండితిప్పలూ మర్చిపోయి కరువుతీరా కబుర్లు చెప్పుకున్నాం. దాన్ని నేను మన ఊరంతా తిప్పి అన్నీ చూపించాను. అది వద్దుంటున్నా షాపింగుకు తీసుకెళ్ళి దానికి అన్నీ కొనిపెట్టాను. ఒక రోజు మన ఫ్రెండ్సు అందర్ని పిలిచి దాన్ని పరిచయం చేసాను. అది వెళ్ళేముందు ఏమందో తెలుసా?

'ఒసేవ్, నిన్ను చూస్తుంటే నాకు చాలా గర్వంగా వుందే" అన్నది !

అందుకే నాకు మీరంటే ఎంతో ఇష్టం !

అమెరికా తీసుకొచ్చి నాలాంటి ఆడవాళ్ళకు ఆత్మ విశ్వాసంతో పాటు సరికొత్త జీవితాన్ని ఇచ్చిన మీ మగవాళ్ళంటే నాకు మహా గౌరవం. అప్పట్లో మన మధ్యతరగతి కుటుంబాలన్నీ పేదరికం అనే బురదలో కూరుకు పోయిన శకటాలే. అటువంటి సంసారాల్ని బయటకు లాగి రోడ్డుమీదకు మళ్ళించిన సంస్కారవంతులు మీరందరు. ఆ రోజుల్లో వచ్చిన మీలాంటి మగాళ్ళందరూ నిజంగా "క్రీమ్ ఆఫ్ ది క్రాప్"

ఏమిటీ ఇవ్వాళ నేను కొత్తకొత్తగా వింతవింతగా మాట్లాడుతున్నానా?